






ప్రైవేట్ టీచర్ల.. శ్రమ దోపిడీ!

- జిల్లాలో అడ్మిషన్‌ల వేటలో ప్రైవేట్ టీచర్లు
- అసలే అరకొర జీతాలు, ఆపై టార్గెట్లు
- మానసిక ఒత్తిడికి గురవుతున్న గురువులు
- తీవ్రమైన ఒత్తిడి చేస్తున్న యాజమాన్యాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వారు ప్రైవేట్ ఉపాధ్యాయులు అయితే చాలీచాలని జీతాలు ఉండే ప్రైవేట్ ఉపాధ్యాయులు ఉన్నత విద్యావంతులై ఉండి కూడా ప్రభుత్వ ఉద్యోగాలు రాక ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ స్కూళ్లలో పని చేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులపై అడ్మిషన్‌ల ఒత్తిడి తీవ్రంగా ఉంది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాల యాజమాన్యాలు టార్గెట్లతో ఉపాధ్యాయులను వేధించడం ప్రారంభించాయి. అడ్మిషన్‌లు తీసుకురాకపోతే ఉద్యోగ భద్రత ఉండదని, జీతం ఇవ్వడం కూడా కష్టమేనంటూ యాజమాన్యాలు స్పష్టంగా హెచ్చరికలు చేయడంతో టీచర్లు మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ప్రైవేట్ టీచర్లు ఇప్పుడు కేవలం బోధనకే పరిమితం కాకుండా ఊరూరా, వాడ వాడలా, ఇంటింటికీ తిరిగి పిల్లల తల్లిదండ్రులను అడ్మిషన్‌ల కోసం అడుగుతున్నారు. దీంతో అసలు నిజానికి తాము టీచర్లమనే గుర్తింపు మరిచిపోయి మార్కెటింగ్ ఉద్యోగులుగా మారిపోతున్నారు. దీంతో ఒక్కసారి ఎంచుకున్న బోధన వృత్తిని వదలలేక.. పట్టుకున్న చాక్‌పీస్ విడవలేక కష్టమైనా సరే.. పడరాని కష్టాలు పడుతూ తీవ్రమైన ఒత్తిడికి గురవుతూ ఉద్యోగాన్ని నెట్టుకొస్తున్నారు.

అరకొర జీతాలు, ఆర్థిక ఇబ్బందులు

ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగుల వేతనాలు ఇప్పటికీ అరకొరగానే ఉన్నాయి. ఇటు కనీసం నెలకు సరిపడా నిత్యావసరాలు, ఇళ్ల అద్దెకు కూడా సరిపోని రూ.5 నుంచి రూ.10 వేల లోపు జీతాలు.. అటు తీవ్రమైన మానసిక ఒత్తిడితో ప్రైవేట్ గురువులు ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారు. అదే విధంగా యాజమాన్యం ఇచ్చే అరకొర వేతనంలో కూడా.. ఏదైనా కారణం చేత స్కూల్‌కు రాకపోతే వేతన కోత విధిస్తున్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వక పోయినా పాఠాలు చెప్పడం తప్పా ఇతర ఉపాధుల్లో పరిచయం లేని ప్రైవేట్ ఉపాధ్యాయులు కష్టమైన ఆ పని చేయక తప్పడం లేదు. కరోనా కాలంలో కూడా బడులు మూతబడి జీతాలు రానప్పుడు కూడా ఉపాధ్యాయులు మరో పని చేయలేక కుటుంబాలతో పస్తులున్నారు. ఇప్పుడు ప్రైవేట్ టీచర్ల ఫీజులు పెరుగుతున్నాయి తప్పా ఉపాధ్యాయుల వేతనం పెరగక పోవడం గమనార్హం.

మార్కెట్ ఉద్యోగుల్లా మారిన ప్రైవేట్ టీచర్లు

ప్రైవేట్ ఉపాధ్యాయులు సాధారణంగానే ఇంట్లో కుటుంబాలకు సమయం ఇవ్వలేకపోతారు. ఈ క్రమంలో వేసవి సెలవుల్లో అయినా ఆహ్లాదంగా కుటుంబంతో గడుపుదాం అంటే అది సాధ్యం కావడం లేదు. ప్రతీ ఏడాది ఇలా వేసవి సెలవులు మొదలవుతాయో లేదో.. అలా మరునాడే తమ పాఠశాలల్లో విద్యార్థుల ను చేర్పించాలని యాజమాన్యాలు టార్గెట్ పెడుతున్నాయి. ఖచ్చితంగా విద్యార్థులను చేర్పించాలనే టార్గెట్లు విధిస్తున్నారు. టార్గెట్ పూర్తి చేస్తేనే ఉద్యోగం, జీతం ఉంటుందని యాజమాన్యాలు స్పష్టంగా హెచ్చరిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో టార్గెట్ పూర్తి చేయని టీచర్లకు వేసవి సెలవులు ఇవ్వడం లేదని తెలుస్తోంది. టార్గెట్ పేరుతో రోజు ఫోన్ కాల్స్ యాజమాన్యాలు చేస్తూ టీచర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీంతో వారు ఒక ప్రొడక్ట్‌ను మార్కెట్ చేసే ఉద్యోగుల్లా ఊరూరా, ఇంటింటికీ తిరుగుతున్నారు. దీంతో వారు టీచర్లా? లేక మార్కెట్ ఉద్యోగులా? అని మర్చిపోయే పరిస్థితి నెలకొంటుంది. ఎంత ఒత్తిడికి గురైనా ఉద్యోగాలు పోతాయనే భయంతో ప్రైవేట్ టీచర్లు ఈ విషయాలను బయటకు తీసుకు రావడం లేదు. మరి కొంత మంది ఈ ఒత్తిడి తట్టుకోలేక ఉద్యోగాల నుంచి తప్పుకున్న సందర్భాలు ఉన్నాయి.

ప్రైవేట్ స్కూళ్లపై కొరవడిన నిఘా

జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలు అతిక్రమిస్తూ.. యాజమాన్యాలు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ఇప్పటి నుంచే అడ్మిషన్‌ల పేరిట ముందుగానే డొనేషన్‌ల రూపంలో ఫీజులు దోచుకుంటున్నారు. అంతేకాకుండా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు టార్గెట్లు పెడుతూ వేసవి కాలంలో మండుటెండలో ఇంటింటికీ అడ్మిషన్‌లకు తిప్పుతూ తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారు. మరి తమ పాఠశాలల్లో పని చేసే ఉద్యోగులకు కనీసంగా పనికి తగ్గ వేతనాలు ఇస్తున్నారా లేదా.. నిబంధనల ప్రకారం సెలవులు వర్తిస్తున్నాయా అనేది సంబంధిత శాఖ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఆడిందే ఆట అవుతోంది.. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు ప్రైవేట్ ఉపాధ్యాయుల వెట్టి చాకిరి జీవితాలను గమనించి. వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్లో నిఘా పెట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రైవేట్ టీచర్లకు ఒత్తిడి తగ్గించాలి

● ప్రమోద్, ప్రైవేట్ టీచర్, ఆదిలాబాద్.



నేను 13 ఏళ్లుగా ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తున్నాను. చాలా వరకు ప్రైవేట్ పాఠశాలల్లో టీచర్లు విధిలేని పరిస్థితుల్లో తక్కువ వేతనాలకు పని చేస్తున్నారు. మళ్లీ బోధలతో పాటు అడ్మిషన్‌లు చేయడం జరుగుతోంది. యాజమాన్యాలు వేతనాలు పెంపు చేసి బోధనేతర పనులను ఉపాధ్యాయులకు అప్పగించడం మానుకుంటే వారి ఒత్తిడిని తగ్గించిన వారవుతారు. టీచర్ల ఒత్తిడి తగ్గితే బోధన మరింత మెరుగుపడుతోంది. దీంతో పాఠశాలలకే మంచి ఫలితాలు వస్తాయి.

ప్రైవేట్ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలి

● మహేందర్, ప్రైవేట్ టీచర్, పొన్నారి గ్రామం



నేను 10ఏళ్లుగా ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తు న్నాను. మాకు అరకొర వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. నిజానికి ఉన్నత విద్యావంతులైన నిరుద్యోగులు తప్పనిసరి పరి స్థితుల్లో అరకొర వేతనాలతో ఇలా పని చేస్తు న్నారు. మాకు ఉద్యోగ భద్రత లేదు. యాజమా న్యం అడ్మిషన్‌ల టార్గెట్ పేరుతో టీచర్లను మానసిక ఒత్తిడికి గురి చేయడం సరికాదు. విద్యాశాఖ పర్యవేక్షణ సరిగా లేక యాజమా న్యాలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

● డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఆదిలాబాద్



ప్రైవేట్ పాఠశాలలు కూడా విధిగా ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించాలి. ఎక్కడైన నిబంధనలు అతిక్రమించినట్లు ఫిర్యాదులు వస్తే విచారణ చేసి తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ పాఠశాలలు ఉపాధ్యాయులకు సముచితమైన వేతనాలిచ్చి ఒత్తిడి తగ్గిస్తేనే మెరుగైన ఫలితాలు వస్తాయి. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం డొనేషన్‌ల పేరిట అధికంగా ఫీజులు వసూలు చేయరాదు. పిల్లల తల్లి దండ్రులపై ఆర్థిక భారం ఉంచకూడదు. ఈ విషయాలను యాజమాన్యాలు గమనించి నడుచుకోవాలి.

వేసవిలో పశువుల సంరక్షణ అవసరం



ఇచ్చోడలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి గోవింద్‌నాయక్

ఇచ్చోడ, ఏప్రిల్, 16 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పశువులను సంరక్షించడం అవసరమని మండల పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నెలరోజుల పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఉచితంగా పాడిపశువులకు, ఎడ్లకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పాడి రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గురువారం మండలంలోని ముక్రా(బీ) గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమం ఉన్నందున పాడిరైతులు పశువులకు టీకాలు వేయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది సంధ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీకాలతో సంరక్షణ..

నేరడిగొండ : పాడి రైతులకు జీవనోపాధి కల్పించే పశువుల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్యాధికారి కార్యాలయంలో మాట్లాడారు. పాడి పశువులు వ్యాధి బారిన పడడంతో పాలఉత్పత్తి తగ్గి రైతులు అధికంగా నష్టపోవద్దనే ఉద్దేశంతో పశువుల ఆరోగ్య సంరక్షణకు ఏడాదికి రెండుసార్లు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నివారణ టీకాలు వేయించామని పేర్కొన్నారు.

గంజాయి సాగుచేస్తే చర్యలు తప్పవు : ఇచ్చోడ సీఐ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నేరడిగొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగుచేస్తే చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ భీమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 160 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కుంటాల ఎక్స్‌రోడ్ వద్ద బత్తుల కిరణ్ అనేవ్యక్తి గంజాయి కలిగి ఉన్నాడనే సమాచారం రావడంతో ఎస్సై శ్రీకాంత్ తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన బత్తుల కిరణ్ వద్ద 160 గ్రాముల గంజాయి పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దంసా తండా గ్రామానికి చెందిన పెందూర్ లచ్చువద్ద నుంచి గంజాయి తెచ్చినట్టు తెలిపారు. అంతే కాకుండా పెందూర్ లచ్చును పట్టుకొని విచారించగా తన వ్యవసాయ పంటలో అంతరపంటగా గంజాయి సాగుచేశానని అనడంతో అతని వద్ద నుంచి 290 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

'శిక్షణ అధికారులు దరఖాస్తు చేసుకోవాలి'

ఉట్నూర్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రంలో స్వయం ఉపాధి కోర్సులను చెప్పే ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని శిక్షణ ఉపాధి కేంద్రం డైరెక్టర్ ఎండీ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వడానికి కుట్టు మిషన్, మగ్గంవర్క్స్, బ్యూటీపార్లర్, హౌజ్‌వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, టూవిల్లర్ మెకానిక్, ఫ్రిడ్జ్, ఏసీ రిపేరింగ్, జ్యూట్ బ్యాగుల తయారీ, సీసీ టీవిల రిపేరింగ్ లాంటి శిక్షణలు ఇవ్వడానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అధికారికంగా ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినం

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- అమరులకు 1.50 కోట్ల ట్రై కార్ రుణాలు
- 15 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 20న ఆదివాసీ గిరిజన అమవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అందరి సహకారంతో శాంతియుత వాతావరణంలో ఘనంగా జరుపుకుందామని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద ఆయన ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్‌లతో సంయుక్తంగా ఆదివాసీ గిరిజన అమరవీరుల సంస్మరణ దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 1981 ఏప్రిల్ 20న అసువులు బాసిన అమరవీరుల స్థూపానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.కోటితో స్మృతి వనంగా తీర్చిదిద్దేందుకు అనేక అభివృద్ధి పనులు చేపట్టావున్నారు. స్థూపం ఆవరణలో ఇంత వరకు చేపట్టిన వివిధ పనులు పర్యవేక్షించారు. స్థూపం వద్ద విద్యుత్, తాగునీరుతో పాటు నివాళులు అర్పించేందుకు వచ్చే ఆదివాసులకు అవసరమైన వసతులు కల్పించాలని ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అదే రోజున జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా అమరులైన 15 కుటుంబాలకు ఐటీడీఏ ద్వారా రూ.1.50 కోట్లతో ట్రైకార్ పథకం ద్వారా వివిధ రుణాలు అందించామన్నారు. దాంతో పాటు ఒక్కొక్కరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే మోడల్ ఇందిరమ్మ గ్రామాలకు ప్రభుత్వం రూ. లక్ష వరకు వారి ఖాతాలో జమచేశారని స్పష్టం చేశారు. మండలంలోని ముత్నూర్ గ్రామంలో అమరులకు కేటాయించిన ఇందిరమ్మ కాలనీలో విద్యుత్, తాగునీరు, గ్రావెల్ రోడ్లుకు తదితర సౌకర్యాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఐటీడీఏ ఈఈ తానాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, ఆదివాసీ అమరవీరుల ఆశయ సాధన కమిటీ అధ్యక్షులు తోడసం నాగోరావు, తహసీల్దార్ ఎం.ప్రవీణ్, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి, ఆదివాసీ రాయిసెంటర్ జిల్లా సార్మేడి మెస్రం దుర్గు పటేల్, ఐటీడీఏ పీహెచ్‌వో సందీప్, ఏపీవో వసంత్‌రావు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ గోడం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి : బోథ్ ఎమ్మెల్యే



పోచమ్మ ఆలయంలో పాల్గొన్న ఎమ్మెల్యే

తలమడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని మారుమూల ప్రాంతమైన టోక్కిగూడ గ్రామంలో నిర్మించిన ఝరికాన్ మోక్ష పెందూర్, పెర్సపెన్‌దా ఆలయ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం గ్రామస్తులు తమ మారుమూల గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఎంతటి మారుమూల గిరిజన ప్రాంతాలైన అభివృద్ధి చేసే బాధ్యత తనదని ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏ సమయంలో సంప్రదించిన 24 గంటలు అందు బాటులోనే ఉంటానని భరోసా కల్పించారు. అదేవిధంగా ఝరినుండి టోకిగూడ వరకు బీటీ రోడ్డు మరమ్మతులు, అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్‌బెడ్ రూమ్‌లు, షేక్ గూడ, టోకిగూడ గ్రామాలకు గుట్టనీరు రాకుండా ఏర్పాటు చేస్తానని హామీ అదేవిధంగా అర్హులైన యువ తకు స్వయఉపాధి పథకాలు అందేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం రూ.25 లక్షలతో నిర్మించిన ఆలయాన్ని ప్రారంభించారు. వీరి వెంట ఝరి మాజీ సర్పంచ్ జనక్ పటేల్, ఝరి సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, టీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర రెడ్డి, మొటే కిరణ్ కుమార్, సుదర్శన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, రమాకాంత్, మల్లేష్, గంగారం, గ్రామ పటేళ్లు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి..

తలమడుగు : ఈనెల 27న వరంగల్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. బుధవారం ఝరి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల కన్వీనర్ తోట వెంకటేష్, ఝరి సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, నాయకుడు సుదర్శన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, జనక్ పటేల్, నర్సింలు, రమాకాంత్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తా : ఎమ్మెల్యే

బోథ్ : మండలంలోని కోటబీ గ్రామంలో ఊరికి పోచ మ్మ విగ్రహ జీర్ణఉద్ధారణ కార్య క్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన పోచమ్మకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం తనవంతు సహాయంగా 51 వేల రూపాయలు మంజూరు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిధు లు మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్‌స్వామి, మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, గ్రామ నాయకులు గంగాధర్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, బోథ్ పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, గ్రామ నాయకులు సోమేశ్ వెండి, ఎస్ రామ్‌రెడ్డి, రమణారెడ్డి, చిన్నా రెడ్డి, కోట ధనుడు లక్ష్మన్న, నేరడిగొండ మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

● డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్



అగ్నిమాపక పరికరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులతోపాటు అగ్నిమాపక పరికరాల పనితీరును పరిశీలించారు. ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన, డాక్టర్ క్రాంతికుమార్, యశోద, రాంప్రసాద్ పాల్గొన్నారు.

యువతిని వేధించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన 20 ఏళ్ల యువతిని వేధించిన హైదరాబాద్‌కు చెందిన షేక్ రహీంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సైఇసాఖ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శాంతి నగర్‌కు చెందిన యువతికి ఏడాది క్రితం హైదరాబాద్‌లోని షేక్‌రహీంతో పరిచయం ఏర్పడింది. పెద్దలు వీరి పెళ్లికి ఒప్పుకోగా, అతను మద్యానికి బానిస కావడంతో పెళ్లికి నిరాకరించింది. దీంతో సోషల్ మీడియాలో యువతి ఫొటోలు మార్ఫింగ్ చేసి పెట్టడంతోపాటు మానసికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎఫ్ఓ జైత్రాం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకొని శ్రీ కృష్ణ ఆస్పత్రిలో సిబ్బందికి ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతికుమార్, అగ్నిమాపక, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన విద్యాశాఖాధికారి



పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ

ఇచ్చోడ, ఏప్రిల్, 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులపై విషప్రయోగం జరిగిన విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ బుధవారం పాఠశాలను సందర్శించారు. ఇచ్చోడ మండలంలోని ధరంపూరి పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల వంటగది తాళం పగలగొట్టి లోపలికి వచ్చి వంట సామగ్రిలో కలిపిన క్రిమిసంహారక మందును పరిశీలించారు. అనంతరం పాఠశాలలో జరిగిన తీరుపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిపానిలో మద్యం పట్టివేత

బీంపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిపాని గ్రామంలో జైనథ్ సీఐ సాయినాథ్, బీంపూర్ ఎస్ఐ ముంతాజ్ అహ్మద్ సిబ్బంది బుధవారం బుర్రి అశోక్ అనే వ్యక్తి అక్రమ మద్యం అమ్ముతుండగా పట్టుకున్నారు. అతని నుంచి రూ. 26,900 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. గ్రామ వీడీసీ ఆధ్వర్యంలో ఈ అనుమతులు లేని బెల్టు షాప్ నిర్వహిస్తున్నారని పోలీసులు తెలుసుకున్నారు. ఈ మేరకు మద్యం అమ్మే అశోక్‌తో సహా వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేశారు. గ్రామాలలో వీడీసీలు ఎలాంటి అనుమతులు లేని బెల్టు షాప్‌లు నిర్వహించడం లాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ పేర్కొన్నారు.



మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆదివాసీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): ఆదివాసీ గిరిజన అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ రాయి సెంటర్ జిల్లా సార్మేడీ మెస్రం దుర్గు పటేల్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ గోడం గణేష్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అడవిబిడ్డల హక్కుల కోసం 1981, ఏప్రిల్ 20న ప్రభుత్వంతో పోరాడి ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ప్రతియేటా ఏప్రిల్ 20న జరిగే ఆదివాసీ గిరిజన అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివాసీ రాయి సెంటర్ సార్మేడీలు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, అమరవీరుల ఆశయ సాధన కమిటీ అధ్యక్షులు తోడసం నాగోరావు, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్ రావు, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్ రావు, మెస్రం నాగనాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కూలుస్తామంటే చూస్తూ ఊరుకోం

● నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి



పట్టణంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

ఆదిలాబాద్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే చూస్తు ఊరుకుంటామా అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడిన తీరును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తీరు మార్చుకోకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి పై రాజద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫ్లెక్సీలతో నినాదాలు చేశారు. ప్రభుత్వాన్ని కూలుస్తామని మాట్లాడడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆహంకారానికి నిదర్శనమన్నారు. ప్రజలకు సన్నబియ్యం ఇస్తునందుకు కూలుస్తారా లేదా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నందుకు కూలుస్తారో బీఆర్ఎస్ నేతలే సమాధానం చెప్పాలన్నారు. అసత్యపు ప్రచారం చేసే బీఆర్ఎస్ నాయకులారా ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ప్రజలు గుణపాఠం చెప్పిన బీఆర్ఎస్‌కు సిగ్గు రాలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, నగేష్, శ్రీలేఖ, జహీర్ తదితరులున్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కోరారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో కేంద్రకార్మిక సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడను తీసుకొచ్చిందన్నారు. ఇందులో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సిర్రదేవేందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి బి.వెంకట్ నారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జఆశన్న, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నేళ్లస్వామి, నాయకులు కె.ఆశన్న, గంగారాం, కోట్నాక్ సక్కు పాల్గొన్నారు.

ఎకరానికి 15 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేయాలి

● తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు, రైతుల వినతి

తాంసి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎకరానికి 15 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తాంసి తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు, మండల రైతులు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఎకరా నికి ఎనిమిది క్వింటాళ్ల 50 కిలోలు మాత్రమే కొనుగోలు చేస్తామనడం సమం జసం కాదని పేర్కొన్నారు. ప్రతిరైతుకు గతంలో కంటే ఈ సంవత్సరం దిగుబ డులు ఎక్కువ వచ్చే వీలుందని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కొనుగోలు చేయాలని కోరారు. లేనిపక్షంలో దశల వారీగా పోరాటాలు చేస్తామని హెచ్చ రించారు. రైతు ప్రభుత్వం పేరిట అధికారం చేపట్టిన రేవంత్ సర్కార్ రైతుల పట్ల చిన్న చూపుచూస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి ఆరోపించారు. రైతురుణమాఫీ, రైతుబంధు ఏమైందని ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేయాలని అన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారం భించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జింకలచ్చన్న, మేకల రాములు, విలాస్, దేవురావు తదితరులున్నారు.

'సోనియా, రాహుల్‌పై ఈడీ చర్యలు కేంద్రం కుట్ర'

బేల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీతోపాటు రాహుల్ గాంధీపై ఈడీ చార్జ్ షీట్ దాఖలు వెనుక కేంద్ర ప్రభుత్వం కుట్ర ఉందని నిరసిస్తూ యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామ రుపేష్ రెడ్డి మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో అగ్ర నేతలు సోనియా గాంధీతోపాటు రాహుల్ గాంధీని ఏ-1, ఏ-2గా చార్జిషీట్‌లో పొందుపర్చి నిందితులుగా జాబితాను విడుదల చేయడాన్ని ఖండించారు. ఇది ముమ్మాటికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రేనని ఆరోపించారు. కార్యక్రమంలో జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విలాస్ పాటిల్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంజయ్ గుండావార్, మాజీ మార్కెట్ చైర్మన్ వామన్ వాంఖడే, యువజన కాంగ్రెస్ మండల కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గాన్ శ్యాం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోడె అవినాష్, జైనథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మడావి చంద్రకాంత్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శంకర్ బొక్రె, కరీం, గులాబ్, మాజీ సర్పంచ్ కేశవ్, మేకల జితేందర్, అహ్మద్ పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కుష్ఠు వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలి

● జిల్లా కుష్ఠు నివారణ అధికారి సాగర్

నార్నూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానం వచ్చినా.. సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలని జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ సాగర్ అన్నారు. బుధవారం ఉమ్మడి మండలంలోని ఝరి, గాదిగూడ, నార్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వద్ద అనుమానితుల వ్యక్తులకు పరీక్షలు చేసి వైద్యాన్ని అందించారు. వారి వెంట డిప్యూటీ పారా మెడికల్ అధికారులు వామన్ రావు, రమేష్, లెప్రాసి నోడల్ అధికారి చౌహాన్ చరణ్ దాస్, స్టాఫ్ నర్స్ విజయ కుమారి, ఏఎన్ఎం సింధు, కైలాష్ ఆశ కార్యకర్తల జ్యోతి, లక్ష్మి, అనిత, సంగీత సిబ్బంది పాల్గొన్నారు.



నార్నూర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్‌సాగర్

పెండింగ్ వేతనాలు ఇప్పించాలి



డీడీని కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉట్నూర్, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): వేతనాలు అడిగితే రేపు, మాపు అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్న సంస్థ కో-ఆర్డినేటర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఉట్నూర్ ఐటీడీఏ డీడీ అంబాజీకి వినతి పత్రం అందజేశామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో డీడీని కలిశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని అనంత సోల్యూషన్, విద్యాంజలి 2.0 ద్వారా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్‌లో ఆఫీస్ సబార్డినేటర్, వాచ్‌మెన్, అటెండర్, స్వీపర్, ఇంగ్లీష్ టీచర్, కంప్యూటర్ ఆపరేటర్, యోగ ఇతర పనులకు సుమారు 40 మందిని ఈ సంస్థ ద్వారా గత సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలల నుంచి రిక్రూట్ చేసుకున్నారన్నారు. రిక్రూట్‌కు ముందు సంస్థ కో-ఆర్డినేటర్ ప్రతినెల రూ.15వేల నుంచి రూ.18 వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లిస్తామని చెప్పారు. కాని నేటికి 8, 9 నెలలు గడిచినా సదరు కో-ఆర్డినేటర్లు వేతనాలు చెల్లించడం లేదన్నారు. వేతనాలు అడిగితే రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని, 8,9 నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు, రోజు వారి ఖర్చులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ పీవో జోక్యం చేసుకుని పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరామన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

బేల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, పాఠశాల భౌతిక, వసతులపై డైట్ ఛాత్రోపాధ్యాయులు చేస్తున్న థర్డ్‌పార్టీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బేల అశోక్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో సర్వేతీరును ప్లానింగ్ కో-ఆర్డినేటర్ నారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. పాఠశాల రిపోర్టుకార్డులో నమోదైన వివరాల ద్వారా భౌతికపరిశీలన చేసి ధ్రువీకరించాలని సూచించారు. ఈనెల 21 వరకు సర్వే కొనసాగుతుందన్నారు. ఆయన వెంట ఎంఈవో కోల నర్సిములు, ఉపాధ్యాయులు ఉన్నారు.

హాస్టల్‌ను సందర్శించిన విశారదన్ మహరాజ్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను లక్ష కిలో మీటర్ల మా భూమి రథ యాత్రలో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ బుధవారం రాత్రి సందర్శించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాత్రూములను అపరిశుభ్రతను చూసి చలించి పోయితానే నీళ్లతో శుభ్ర పరిచి టాయిలెట్లను క్లీన్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నేతలు, ధర్మసమాజ్ పార్టీ స్టేట్ సెక్రటరీ జిల్లా ఇన్‌చార్జి పాల్గొన్నారు.

తాగుడుకు బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య

బోథ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంపత్ నాయక్‌తండాకు చెందిన జాదవ్ దేవిదాస్ (40) అనేవ్యక్తి పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు బోథ్ ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. మృతుడు కొన్ని రోజులుగా తాగుడికి బానిసై ఈనెల 15న సాయంత్రం మద్యం తాగిరావడంతో భార్య జాదవ్ సుమన్ బాయ్ మందలించింది. అయితే దీంతో మనస్థాపనకు గురై పురుగుల మందు సేవించాడు. కుటుం వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికి త్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసునమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

● ఎంపీడీవో చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

తలమడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీసభ్యులు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు కమిటీ సభ్యులను ఎంపిక చేయాలని సూచించారు. అదేవిధంగా లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు. మండలంలో మొదటివిడత, రెండోవిడత కలిపి 465 ఇండ్లు మంజూరయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు. ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుందన్నారు. అదేవిధంగా బిల్లుల చెల్లింపులు మూడు విడతలుగా అందిస్తున్నామన్నారు. ఇందులో ఎంపీఈవో వినోద్, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలతో ఇబ్బందులు

ఉట్నూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులు మారుతుండడంతో ఈదురుగాలులు వచ్చిన వెంటనే కరెంట్ తొలగించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మంగళవారం రాత్రి 9.30గంటల ప్రాంతంలో వీచిన ఈదురుగాలులకు కరెంట్ అంతరాయం ఏర్పడింది. రాత్రి రెండు గంటలకు కరెంట్ వచ్చే వరకూ ప్రజలు జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉట్నూర్ మండలంలోని లక్కారం విద్యానగర్ పాత ఉట్నూర్ ప్రాంతాలలో ప్రజలు ఉక్కపోతకు తోడు దోమలు పెరిగి పోవడంతో కరెంట్ కోసం వేచిచూడక తప్పలేదు. విద్యుత్ స్తంభాల పైనుంచి చెట్ల కొమ్మలు అడ్డుగా ఉంటే విద్యుత్ సిబ్బంది తొలగించాల్సి ఉంటుంది. గాలి వీస్తున్నప్పుడు విద్యుత్ తీగలు చెట్ల కొమ్మలకు తగిలి కరెంట్ పోవడం వల్ల కరెంట్ పునరుద్ధరించడానికి సమయం పడుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత

మావల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 12 గ్రాముల గంజాయిని మావల పోలీసులు పట్టుకున్నారు. ఎస్సైయ్ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కేఆర్కే కాలనీకి చెందిన అంబదాస్‌కు గాదిగూడ మండలం చింతగూడ గ్రామానికి గంజాయి సరఫరా చేస్తుంటాడు. అయితే మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తు అనుమానాస్పదంగా కనిపించారు. కాగా వీరిని తనిఖీ చేయడంతో గంజాయి పట్టుబడింది. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సైయ్ తెలిపారు.

బీజేపీ ఎదుగుదలను ఓర్వలేకపోతున్న కాంగ్రెస్

● మూడు పార్టీలు కుమ్మక్కై దుష్ప్రచారం

● పార్టీ రాష్ట్ర నాయకుడు రాంనాథ్ ధ్వజం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బీజేపీ ఎదుగుదల చూసి ఓర్వలేక కాంగ్రెస్ సహా బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కుట్రలు చేస్తున్నాయని రాష్ట్ర బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నిర్మల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ... సీఎం స్థాయి వ్యక్తి బీజేపీ బ్రిటిష్ కంటే ప్రమాదకరమైందని మాట్లాడటం, రాష్ట్రంలో బీజేపీని అడుగు పెట్టనీయమని అనడం బీజేపీ ఏ విధంగా ఎదుగుతుందో అర్థమవుతోందన్నారు. బీజేపీ కాంగ్రెస్ పార్టీ గుండెల్లో దడ పుట్టిస్తోందన్నారు. బీజేపీని నిందించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ధీటుగా పార్లమెంటు స్థానాలు గెలుచుకుందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీని జీరో స్థానానికి తీసుకెళ్లిందన్నారు. తెలంగాణలో బీజేపీని అడ్డుకునే శక్తి ఏ పార్టీ లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే ప్రమాదకరమైందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఇప్పటి నుండే క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వారికి చేరే విధంగా చూడాలని సూచించారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఏడాదిలోనే కేంద్రం నుండి వేయి కోట్ల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎంఐఎం, బీఆర్ఎస్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు ఏనుగు వెంకట్ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు తోకల అనిల్, లవ కుమార్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్, నరేష్, శ్రావణ్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారు

● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్

ఖానాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అన్నారు. బుధవారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే అమలువుతోందన్నారు. ఇప్పటి వరకు సొంతంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రతి పథకం కేంద్ర నిధులతో అమలవుతున్నప్పటికీ కనీసం ప్రధాని మోదీకి కృతజ్ఞత చెప్పే విజ్ఞత కూడా కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. నాడు కేసీఆర్ పదేళ్ల పాలనలో ఆరు లక్షల కోట్ల అప్పులు చేస్తే నేడు రేవంత్‌రెడ్డి 14 నెలల పాలనలో లక్ష యాభై వేల కోట్ల రూపాయలు అప్పు చేశారన్నారు. ఇకనైనా ఊక దంపుడు ఉపన్యాసాలు మానుకొని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు వాస్తవ పరిస్థితుల్లోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల శ్రీనివాస్, నియోజక వర్గ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, నాయకులు గోపాల్‌రెడ్డి, కిషన్, జీవన్, స్వామి, శ్రీకాంత్, పోశెట్టి, తదితరులున్నారు.

ఏరువాక కేంద్రంలో రైతు సదస్సు

ముథోల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ఏరువాక వ్యవసాయ పరిశీలన స్థానం కేంద్రంలో బుధవారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య, శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ కార్తీకల ఆధ్వర్యంలో రైతు సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో జగిత్యాల వ్యవసాయ విశ్వవిద్యాలయంకు చెందిన శాస్త్రవేత్తలు డా. సౌజన్య, డా. ప్రజ్ఞ, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. మొక్కజొన్నలో జంటసాళ్ల పద్ధతి, అధిక సాంద్రత పత్తి పద్ధతి, వరిలో డ్రమ్ సీడర్, సోయా సీడ్‌లో విశాల పట్టి, నడక మాడల్స్‌ని సందర్శించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, శిశు మందిర్ ప్రధానోపాధ్యాయులు సారధి రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో రెస్టారెంట్లు, కన్ఫెక్షనరీ డ్రై ఫ్రూట్స్, మిఠాయి తయారీ కేంద్రాలపై

రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక దాడులు



బూజు పట్టిన క్యాబేజీ



రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందాలు



రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల తయారీ వద్ద దృశ్యం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పలు రెస్టారెంట్లు, తినుబండారాల తయారీ కేంద్రాలు, మిఠాయిలు, డ్రై ఫ్రూట్స్ దుకాణాల్లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం ఆకస్మిక సోదాలు నిర్వహించింది. ఈ ఫుడ్ సేఫ్టీ సోదాల్లో భాగంగా పట్టణంలోని మయూరి హోటల్, బంధన్ స్వీట్ షాప్, దత్తాత్రేయనగర్‌లోని డ్రై ఫ్రూట్స్ హౌస్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు నిర్వహించిన రెస్టారెంట్లలో వంటగది, రిఫ్రిజిరేటర్‌లు పూర్తిగా అపరిశుభ్రంగా ఉండడం జరిగిందని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. సుమారు పది వేల రూపాయల విలువ కలిగిన నిల్వ చేసిన కుళ్లిన మాంసపు ఉత్పత్తులను, హానికర, ప్రమాదకరమైన రంగులను కలిపిన చికెన్, కాలం చెల్లిన సాస్, లేబుల్ డిఫెక్ట్ కలిగిన పన్నీర్, పూర్తిగా అపరిశుభ్రత వాతావరణంలో నిల్వ ఉంచిన కూరగాయలను గుర్తించామన్నారు. పట్టణంలోని ఐఎఫ్‌సీ రెస్టారెంట్ నందు స్టోర్ రూమ్‌లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో ఎలుకల విసర్జితాలతో కూడిన సుమారు 5,000ల రూపాయల విలువ గల ముడి సరుకులను గుర్తించి హోటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆ వస్తువులను ధ్వంసం చేసి, ఎఫ్ఎస్ఎస్ చట్టం 2006ను పా టించనందుకు నోటీసులను జారీ చేశామన్నారు. దత్తా త్రేయనగర్‌లో గల డ్రై ఫ్రూట్స్ హౌస్‌లో తనిఖీ చేయ గా నిర్వాహకులు ఎటువంటి పరిశుభ్రత ప్రమా ణాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, అధికమోతాదులో రంగులు కలిపినటువంటి ఆహా ర పదార్థాలను లేబుల్ డిఫెక్ట్ కలిగిన రెడీ టు ఈట్ సేవరిస్ అయినటువంటి కార, మురుకులు, పచ్చి బఠాణి ఇతర అనుమానిత ఆహార పదార్థాల శాంపిళ్లను పరీక్ష నిమిత్తం హైదరాబాద్‌లో గల ల్యాబ్‌కు పంపించడం జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలకు నష్టం కలిగించే విధంగా హానికర ఆహార పదార్థాలను విక్రయించవద్దని, నాణ్యత ప్రమాణాలను పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ ఆహార నాణ్యత తనిఖీల్లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి, టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్స్ రోహిత్ రెడ్డి, స్వాతి, శ్రీశిక, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసిన ఆహార పదార్థాలను ల్యాబ్‌కు పంపిస్తున్న దృశ్యం

చలో వరంగల్ ను విజయవంతం చేయాలి

● ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు కిరణ్ కొమ్రెవార్

బాసర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో ఈనెల 27 తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవసభకు పార్టీ కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు కిరణ్ కొమ్రెవార్ పిలునిచ్చారు.బుధవారం బాసర మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు కోర్వ శ్యామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినా సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ముఖ్య కార్యకర్తలను దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, బీఆర్ఎస్ పరిపాలనను గుర్తుచేసుకుంటున్నరని చెప్పారు.పట్టణం ,పల్లెలు అని తేడా లేకుండా అన్నిచోట్ల అన్నీ వర్గాలు బీఆర్ఎస్ వైపే ఉన్నాయని అన్నారు. వరంగల్ సభను పెద్దఎత్తున కార్యకర్తలు ప్రతి గ్రామం తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్వ శ్యామ్ ,గంగారావు ,నర్సింగ్ రావు,దిగంబర్,లక్ష్మారెడ్డి, గంగాధర్, నాగనాథ్,లాల్మీయ, బాబుమియా, కార్యకర్తలు పాల్గొన్నారు.

● అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం వేంటనే రెగ్యులరైజ్ చేయాలని నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు కిరణ్ కొమ్రెవార్ డిమాండ్ చేశారు.బాసర ఆర్జీయూకేటీ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు.వారితో నిరసనలో పాల్గొన్నారు.సమస్యను పార్టీ అధినేత కేసీఆర్ దృష్టికి తీసికెళ్లి పరిష్కారమయ్యేవిధంగా చూస్తానని కిరణ్ కొమ్రెవార్ హామీ ఇచ్చారు.



కుంటాల, ఏప్రిల్, 16 : (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రజతోత్సవ సభను ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. బుధవారం అందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన కుంటాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.



గ్యాస్ సిలిండర్‌లో మంటలు చెలరేగితే ఎలా ఆర్పాలో వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలి

ఖానాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని ఖానాపూర్ ఇన్‌చార్జి ఫైర్ అధికారి జావేద్ అలీ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వ్యవహరించాల్సిన విధానాలను వివరించారు. ఈ సందర్భంగా భవనాలలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఇళ్ల ఎలా ఖాళీ చేయాలో మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. గ్యాస్ సిలిండర్లలో మంటలు చెలరేగినప్పుడు ఆందోళన చెందకుండా ఆ మంటలను ఆర్పేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రతలపై పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది ఖదీర్ ఖాన్, మహేందర్, హుస్సేన్, వెంకటేష్, శ్రీకాంత్, సాయిచరణ్, నరేష్, కృష్ణ, తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరుపై వీడియో కాన్ఫరెన్స్

ముథోల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయా శాఖల మండల అధికారుల కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎండాకాలం దృష్ట్యా త్రాగునీటి ఇబ్బందులు ఎదురు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో రచన, ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

కుంటాల, ఏప్రిల్, 16 : (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం దృష్ట్యా గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం మండల కేంద్రం కుంటాల స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణతో పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించే ఇంకుడు గుంతల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని, అన్ని శాఖల అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

నూతన రోడ్డు నాణ్యతను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

తానూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన రోడ్డు నాణ్యతను బుధవారం మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ పరిశీలించారు. గ్రామంలోని బాలాజీ గుట్ట అభివృద్ధికి కొరకు మహాలక్ష్మీ మాత పోచమ్మ అమ్మవారి దేవలయాల పునఃనిర్మాణం కొరకు, రోడ్డు నిర్మాణం కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. కోటికి పైగా నిధులు విడుదల చేసిందని, ఇట్టి అభివృద్ధి పనులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈయన వెంట బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, సదాశివ్‌పటేల్, రామచంద్రరెడ్డి, ముత్యంరెడ్డి, గోవింద్, అమృత్, జాడె, శ్రనివాస్, నాయకులు తదితరులున్నారు.

భీంపూర్‌లో దాహం.. దాహం!

● మిషన్ భగీరథ నీరు ఎక్కడ..!? ● కుళాయిల్లో కనిపించని నీటి చుక్క. ● గొంతు తడవాలంటే పశువులు పక్కగ్రామాల్లోకి వెళ్లాల్సిందే..!



భీంపూర్ ముఖ చిత్రం

భీంపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం మొదలైంది. దీంతో గిరి గ్రామాల్లో దాహం కేకలు మొదలయ్యాయి. మిషన్ భగీరథ నీరు ఎక్కడ అని స్థానిక గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మిషన్ భగీరథలో భాగంగా నిర్మించిన నీటి తొట్టెలో నీరు లేక ఎండిపోయి దర్శనం ఇస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... భీంపూర్ మండల కేంద్రంలో గతంలో నిర్మించిన నీటి కోలాయిలు, పని చేయకపోవడంతో మ హిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుళాయిలు నిర్మించి నిర్ల క్ష్యంగా వదిలేశారు. దీంతో అందులో నీటి జాడ కనిపిం చడం లేదు. పశువుల కోసం నీటి తొట్టెలు నిర్మించినప్పటికీ అవి చెత్త చెదారంతో నిండి పోయాయి. దీంతో పశువులు సైతం దాహం తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాయి.

● దాహం తీరాలంటే పశువులు పక్కగ్రామాలకు వెళ్లాల్సిందే!

ఇక్కడ పశువులకు దాహం తీర్చుకునేందుకు చుక్క నీరు లేకపోవడంతో పక్క గ్రామాల్లోకి వెళ్లి దాహం తీర్చుకుంటున్నాయి. పశువులు ఇలా పక్క గ్రామాల్లోకి వెళ్లడం అక్కడి గ్రామస్థులు బంజరు దొడ్డిలో వేసి సుంకం విధిస్తున్నారు. దీన్ని భరించలేక భీంపూర్ గ్రామ రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పుడే ఇంత ఇబ్బందులకు గురవుతుంటే రాబోయే వేసవిలో నీటి కోసం మరెన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవే ద న వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని నీటి కొరత నివారించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

● మిషన్ భగీరథ పైప్‌లు బిగించి వదిలేసి..

భీంపూర్ గ్రామంలో గతంలోనే అధికారులు మిషన్ భగీరథ పైప్‌లైన్‌లను బిగించి, నల్లాల ఏర్పాటు చేయ కుండానే అలాగే వదిలేశారు. ఇంటింటికి పైప్‌లైన్ బిగించి నీరు మాత్రం రావట్లేదని స్థానికులు వాపోతున్నారు.

● మా గోస తీర్చి నీరందించాలి



మా గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లైన్ ఏర్పాటు చేశారు. కాని ఒక చుక్క నీరు రావడం లేదు. దీంతో వేసవి కాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దీంతో దూర ప్రాంతంలో ఉన్న బావుల నుంచి నీరు తీసుకురావాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మా గోస తీర్చాలని కోరుతున్నాం.

- మైత్రిబాయి, స్థానికురాలు, భీంపూర్

● పశువులు అల్లాడుతున్నాయి



మా గ్రామంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేసిన అవి నిరుపయోగంగా మారాయి. దాంతో చెత్తాచెదారం నిండి వినియోగం లోకి లేకుండా పోయాయి. దీంతో మా పశువులు పక్క గ్రామాలకు వెళ్లి దాహం తీర్చు కునే పరిస్థితి నెలకొంది. దీంతో దాహం తీర్చుకునేందుకు పశువులు అల్లాడుతున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నాం.

- వెట్టి మనోహర్, గిరిజన రైతు, భీంపూర్


భీంపూర్‌లో మిషన్ భగీరథ నీరు రాని ఇల్లు


భీంపూర్‌లో చెత్తతో నిండిన నీటి తొట్టెలు


మార్చి మాసంలో శివసాగర్ ప్రాజెక్టులో నీళ్లు

ఆంధ్రజ్యోతి పరిశీలన


ఎండిపోయిన శివసాగర్ ప్రాజెక్టు


శివసాగర్ ప్రాజెక్టు ప్రాంతంలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు

అడుగంటుతున్న శివసాగర్ ప్రాజెక్టు

● ఎండిపోతున్న భూగర్భ జలాలు ● మోటార్లతో పంటలకు నీళ్లు

ఉట్నూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని శివ సాగర్ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగు నీరు అందించడంతో పాటు భూగర్భ జలాలు అభివృద్ధిలోకి తేవాలని భావించి నిర్మించిన శివసాగర్ ప్రాజెక్టు అడుగంటి పోతుంది. దశాబ్దం కంటే ముందు ఖానాపూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన స్వర్గీయ రాథోడ్ రమేష్ ఆధ్వర్యంలో మంజూరు చేయించిన శివసాగర్ ప్రాజెక్టు ద్వారా ఉట్నూర్ మండలంలోని నాగాపూర్, షాంపూర్, టక్కు గూడ, ఎంకా, రామ్ లింగంపేట, పేరుకగూడ, చీమ నాయక్ తండా తదితర ప్రాంతాల ప్రజలకు సాగునీరు అందించాలని సుమారు రూ.4.50కోట్లతో శివసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణంతో సంబరపడిన రైతులు ప్రతీయేటా మూడు పంటలు సాగు చేస్తున్నారు. యాసంగి పంటలుగా మొక్కజొన్న, జొన్న లాంటి ఆహార పంటలు పండిస్తున్న రైతులు కూరగాయలు కూడా సాగు చేస్తున్నారు. ఇటీవల యాసంగి పంటలు సాగు చేస్తున్న రైతులు తమ పంటలకు సాగునీరు అందుకోవడానికి చెరు వులో మోటర్లు పెట్టి పైపులైన్ల ద్వారా తమ పంటకు నీరు పెట్టుకోవడంతో చెరువు పూర్తిగా ఎండిపోతుంది. దీంతో ఈ ప్రాంతంలోని బావులు, బోరుబావుల్లో, భూగర్భజలాలు ఇంకి పోయి ప్రజలకు మరో రెండు నెలల పాటు మంచినీటి ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని గ్రామీణులు అంటున్నారు.

● ఖరీఫ్ కాలంలో నిండుకుండలా శివసాగర్

వర్షాకాలంలో ఖరీఫ్ పంట సమయంలో కురిసిన వర్షాలకు శివసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఖరీఫ్ పంట కాలంతో పాటు, రబీ పంటలు పండించిన రైతులు కొంత మంది యాసంగి పంటలుగా మొక్క జొన్న, జొన్న పంటలను సాగు చేస్తున్నారు. తమ పంటలను రక్షించుకోవడానికి శివసాగర్ ప్రాజెక్టులో మోటార్లు పెట్టి పంటల వరకు పైప్‌లైన్లు వేసి పంటలకు నీళ్లు చేరవేస్తుండడంతో శివసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గి పోయి వెల వెల బోతుంది. ప్రాజెక్టులో మోటార్లు పెట్టకుండా మండల అధికారులు అడ్డుకుంటే ప్రజలకు మంచినీరు అందేలా భూగర్భ జలాలు ఉండేవని, అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం వల్లనే గడ్డు పరిస్థితులు వస్తున్నాయని ప్రజలు అంటున్నారు.


వర్షాకాలంలో నిండుకుండలా ఉన్న శివసాగర్ ప్రాజెక్టు

కన్నుల పండువగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు


శివ, పార్వతుల కల్యాణోత్సవ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భైంసా, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి నగర్ కాలనీ పరిధిలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ తొలి వార్షికోత్సవ వేడుకలు బుధవారం కన్నుల పండువగా కొనసాగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వాహక కమిటీ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభయమానంగా ఆలంకరించారు. వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఉదయం వేళలో ఆలయ ప్రాంగణంలో మహా చండీ యాగం నిర్వహించారు. మధ్యాహ్నం వేళలో ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై శివ,పార్వతుల కల్యాణోత్సవ వేడుకలు జరిపించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు భైంసాతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఎండలతో జాగ్రత్త!

● వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ● స్వీయ రక్షణే మేలంటున్న వైద్యులు


ఎండలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సారంగాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు భగ్గుమంటున్నాయి. తీవ్ర ఉష్ణోగ్రతలు వడగాలులు సమయంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దాహం వేయక పోయిన వీలేనప్పుడల్లా నీరు తాగాలని చెప్తున్నారు. ఉబ్బరం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి నీరు, కూల్ డ్రింక్స్, జ్యూస్ వైపు మొగ్గు చూపుతున్నారు. అదే విధంగా కూలర్లు ఫ్యాన్ల కింద సేద తీరుతున్నారు.

● ఎండలో వెళ్లే సమయాల్లో..

బయటకు వెళ్లే సమయంలో నీటి బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించడం మంచింది. టోపి, టవల్ లాంటి వాటిని ఎండకు కప్పుకోవాలి. గొడుగు పట్టుకోవాలి. ఎండలో నడిచే సమయంలో పాదరక్షలు తప్పక ధరించాలి. ఇంట్లో తయారు చేసిన మజ్జిగ నిమ్మరసం లాంటివి వెంట తీసుకెళ్లాలి. సంత్ర, ద్రాక్ష, పుచ్చకాయ్య, తర్బుజా లాంటి అధిక నీటి శాతం ఉన్న పండ్లను తినాలి. వివిధ పండ్ల రసాలు తాగాలి చెరుకు రసం కూడా తాగితే ఎండలో శరీరానికి అవసరయ్యే మినరల్స్ లభిస్తాయి. భోజనంలో ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తినాలి.

● వడదెబ్బ లక్షణాలు.. జాగ్రత్తలు!

వడదెబ్బ తగిలితే తీవ్ర జ్వరం, తలనొప్పి, బీపీ తగ్గిపోయి, కళ్ళు తిరగడం వంటి లక్షణాలు ఉంటాయి. వాంతులు, విరేచనాలయ్యే అవకాశం ఉంటుంది. నాలుక తడారుతుంది. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకెళ్లి సేద తీర్చాలి. తడి బట్టతో తుడవాలి. మజ్జిగ నీరు, కొబ్బరి నీరు తాగించాలి. ప్రథమ చికిత్సనంతరం ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

● అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి: డీఎంహెచ్‌వో రాజేందర్

వేసవి ఎండలు తీవ్రమయ్యాయి. ఎండలో ప్రజలు అత్యవసరమయితే తప్ప బయటకు వెళ్ళవద్దు. మధ్యాహ్నం 12 నుండి 3గంటల వరకు సమయంలో ఎండ తీవ్రత ఎక్కువ ఉంటుంది. ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఎండలో పాదరక్షలు తలకు టోపి లేదా రుమాలు ధరించి ప్రయాణం చేయాలి.


ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో భూమేష్


అయోధ్య బాల రామయ్య సన్నిధిలో భూమేష్

38 రోజులు.. 1306 కిలో మీటర్లు!

● పాదయాత్రగా వారణాసికి
● దిలావర్‌పూర్ యువకుడి సంకల్పం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కుస్త్రపురం భూమేష్ అనే యువకుడు 38 రోజుల్లో 1306 కిలోమీటర్లు పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశాడు. ప్రయాగరాజ్, అయోధ్య, వారణాసి (కాశీ) దేవాలయాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాడు. భగవంతుడిపై భక్తి, ఆధ్యాత్మిక భావననే ఈ పాదయాత్రకు ఉసిగొల్పినట్లు భూమేష్ అన్నారు. మార్చి నెల 10వ తేదీన దిలావర్‌పూర్‌లోని హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన భూమేష్ తన పాదయాత్రను ప్రారంభించాడు. దిలావర్‌పూర్ నుంచి ప్రారంభించిన పాదయత్రలో వివిధ రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయాలను దర్శించుకుంటూ ముందుకు సాగాడు. దిలావర్‌పూర్ నుంచి 924 కిలో మీటర్లు ప్రయాగ్ రాజ్ అక్కడి నుండి 164 కిలో మీటర్ల దూరంలో అయోధ్య చేరుకున్నాడు. అయోధ్యలో బాల రామయ్యను దర్శించుకుని అటునుంచి శివయ్య దర్శనం కోసం మరో 218 కిలో మీటర్లు నడిచి వారణాసి (కాశీ)కి చేరుకున్నాడు. శివయ్యను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాడు. మొత్తం 1306 కిలో మీటర్ల దూరం నడిచిన భూమేష్ ఆధ్యాత్మిక పాదయాత్ర పూర్తి చేసుకున్నాడు.

గతంలోనూ శబరిమల, తిరుపతి, కొండగట్టుకు పాదయాత్ర


వారణాసికి చేరుకున్న భూమేష్

భూమేష్ గతంలోనూ కేరళలోని శబరిమల పాదయాత్రగా వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. తిరుపతికి నడుచుకుంటూ వెళ్లి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నాడు. కొండగట్టు, వేములవాడ కూడా పాద యాత్ర చేసి ఆంజనేయ స్వామిని, రాజ రాజేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాడు. ఆధ్యాత్మిక పాదయాత్రలు చేస్తూ భగవం తుడి సేవలో తరిస్తున్న భూమేష్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా భూమేష్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు దిలావర్‌పూర్ గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పంచాయతీ భవన నిర్మాణంలో నాణ్యతా లోపం

● ప్రారంభానికి ముందే పగుళ్లు ● పట్టించుకోని అధికారులు ● రెండు సంవత్సరాలైనా పూర్తి కాని భవనం


అసంపూర్తిగా ఉన్న దొర్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం


నిర్మాణ దశలోనే పగుళ్లు తేలిన దృశ్యం

తలమడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాలనా సౌలభ్య కోసం గత ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటుచేసింది. వాటి సొంత భవనాలు నిర్మించాలనే సంకల్పంతో ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపు 20 లక్షల వ్యయంతో కొత్త గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో రెండేళ్లుగా అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కొత్తగా ఏర్పడ్డ దొర్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఐటీడీ ద్వారా రూ.20 లక్షల నిధులు మంజూరు చేయగా పనుల్లో నాణ్యత లోపించి ప్రారంభానికి పగుళ్లు ఏర్పడున్నాయి. అంతేకాకుండా సంబంధిత శాఖ అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో రెండు సంవత్సరాల నుంచి పనులు నత్తనడక కొనసాగుతున్నాయి. అంతేకాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రారంభానికి ముందే పగుళ్లు తేలుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా సదరు నిర్మాణ కాంటాక్టు వరకు ఇప్పటివరకు ఎలాంటి నిధులు రాలేదని కాంట్రాక్టర్ వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి అసలు పూర్తిగా ఉన్న దొర్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం త్వరగా పూర్తి చే యాలని పలువురు కోరుతున్నారు.


ఖరీఫ్ సాగుకు రైతాంగం సన్నద్ధం

● పత్తిని తీసి వేస్తున్న అన్నదాతలు

తాంసి, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): రబీ సాగు సహితం ఈ సంవత్సరం రైతాంగానికి తీవ్ర నష్టాలతో పాటు కష్టాలను చవి చూయించింది. అడుగంటి నా భూగర్భ జలాలతో పాటు మండుతున్న ఎండల కారణంగా అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లోతోంది. రబీ పంటల దిగుబడులు సైతం గణనీయంగా తగ్గిపోయాయి. చేతికి వచ్చే పంట అడుగంటుతున్న భూగర్భ జలాల కారణంగా పూర్తిగా ఎండు బారిపోయాయి. కష్టాలు, నష్టాలు పక్కన పెట్టి మళ్లీ ఖరీఫ్ సాగు కోసం రైతాంగం తమ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. రబీ తమకు ప్రత్యామ్నాయమని రైతులు ఆ పంటల సాగు కోసం ఈ ఏడు పడరాని పాట్లు పడ్డారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడు మూడు నెలల ముందుగానే పత్తి పంట పూర్తి అయింది. ప్రస్తుతం జొన్న పంట కొంతమంది రైతులవి కోతకు రాగా, వారం పది రోజుల్లోగా మిగిలిన రైతులవి కూడా కోతకు రానున్నాయి. ఈ ఏడు ముందుగా వర్షాలు రావచ్చన్న వాతావరణ శాఖ సమాచారం మేరకు రైతులు ముందుగానే పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. రబీ ఆదుకోకపోయినా కనీసం ఖరీఫ్ సాగుతోనైనా రైతుల కష్టాలు తీరుతాయని ఆశిద్దాం.


విత్తనాలు నాటేందుకు సిద్ధం చేసిన పంట పొలం


ట్రాక్టర్‌తో పత్తిని తొలగిస్తున్న దృశ్యం



- ప్రధాన పార్టీల్లో సమస్యగా మారుతున్న సమన్వయం
- నేతల మధ్య కొరవడుతున్న స్నేహభావం
- రాజకీయ కేంద్రంలో అన్ని పార్టీలను వెంటాడుతున్న నేతల తీరు
- బీజేపీలో ప్రధాన నేతల మధ్య అభిప్రాయ బేధాలు
- కాంగ్రెస్‌లోనూ అదే పరిస్థితి
- పత్తా లేని బీఆర్ఎస్ కార్యకలాపాలు
- సతమతమవుతున్న అన్ని పార్టీల కేడర్



కుదరని సమన్వయం

నిర్మల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అంతర్గత విభేదాలతో సతమతమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ రెండు పార్టీల్లోని నేతలు చాలా సందర్భాల్లో విడివిడిగా వ్యవహరిస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది. ఇటు బీజేపీలోనూ అటు కాంగ్రెస్ పార్టీలోనూ ఆ పార్టీ సీనియర్ నేతల వైఖరి కారణంగా కేడర్ సైతం అయోమయానికి గురవుతోంది. నేతల తీరుతో చాలా మంది సీనియర్ కార్యకర్తలు పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటుండడం విశేషంగా చెబుతున్నారు. బీజేపీలో నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీలు నేతల వర్గ విభేధాలకు ఆజ్యం పోస్తున్నాయంటున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డితో కొంతమంది సీనియర్ నాయకులు విభేదిస్తున్న వ్యవహారాలు చాలా రోజుల నుంచి రాజకీయ వర్గాల్లో చర్చకు తావిస్తున్నాయి. పార్టీలోని పలువురు సీనియర్ నాయకులు ఎమ్మెల్యే వ్యవహార శైలిపై అసంతృప్తితో ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. పార్టీ పరమైన ఓ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అలాగే సీనియర్ నాయకులు వేరు వేరుగా నిర్వహిస్తున్న సంఘటనలు ఆ పార్టీ కేడర్‌ను గందరగోళానికి గురి చేస్తున్నాయని అంటున్నారు. అయితే ముఖ్య కార్యక్రమాల్లో మాత్రం నేతలంతా ఒకే వేదికపై కనిపిస్తున్నప్పటికీ సంస్థాగత పరమైన కార్యక్రమాలను సైతం వేరువేరుగా నిర్వహిస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇదిలా ఉండగా ముథోల్ నియోజకవర్గంలో సైతం బీజేపీ సీనియర్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే మధ్య బేదాభిప్రాయాలు మొదలయ్యాయని అంటున్నారు. ఎమ్మెల్యే వైఖరి కారణంగా పలువురు సీనియర్ నాయకులు ఇప్పటికే తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని చెబుతున్నారు. భైంసా పట్టణంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో కూడా సీనియర్ నేతలంతా తలో దారిన నడుస్తుండడం ఆ పార్టీ కార్యకర్తలకు మింగుడు పడడం లేదు. ప్రణాళిక ప్రకారంగా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పార్టీ కార్యక్రమాలకు ప్రజల్లోకి తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. అయితే మొదటి నుంచి డీసీసీ అధ్యక్షునితో దూరంగా ఉంటున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తన అనుచరులు, అనుయాయులతో వేరు వేరుగా పార్టీ కార్యకలాపాలను సాగిస్తుండడం జిల్లాలో చర్చకు తావిస్తోంది. దీనికి తోడు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డిలు సైతం పార్టీ జిల్లా అధ్యక్షుని ప్రమేయం లేకుండానే పలు కార్యకలాపాల్లో పాల్గొంటుండడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముథోల్ నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ పార్టీ నేతలు తలో దారిన నడుచుకుంటున్నారని అంటున్నారు. అక్కడ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు క్రమక్రమంగా పతాకస్థాయికి చేరుకుంటుందని చెబుతున్నారు. వీరిద్దరు మాజీ ఎమ్మెల్యేలు పార్టీ కార్యక్రమాలను వేరు వేరుగా నిర్వహిస్తూ తమబల ప్రదర్శనకు ఈ కార్యక్రమాలను వేదికలుగా చేసుకుంటుండడం ఆ పార్టీలోని విభేధాలకు నిదర్శనంగా నిలుస్తుందని అంటున్నారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వ కొరతతో సతమతమవుతోంది. ఆ పార్టీలోని మిగిలిన కొంత మంది నాయకులు సైతం తలోధారిన నడుస్తూ జనానికి పార్టీని చేరువ చేసే ప్రయత్నాలు చేయ డం లేదంటున్నారు.

బీజేపీలో..

కాగా జిల్లా బీజేపీలో గత కొంతకాలం నుంచి నెలకొన్న పరిస్థితులు ఆ పార్టీ సీనియర్ కార్యకర్తలను ఆవేదనకు గురి చేస్తున్నాయని అంటున్నారు. నేతల మధ్య సయోధ్య లేకపోతుండడంతో పార్టీ బలోపేతానికి ఆటంకంగా మారుతుందని చెబుతున్నారు. పార్టీలో దీర్ఘకాలం నుంచి పని చేస్తున్న కొంతమంది సీనియర్ నేతలతో ఎమ్మెల్యే అనుచరులకు కొంతదూరం పెరిగిందని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీలోని సీనియర్‌లు, మిగతా నాయకులంతా కలిసి సమిష్టిగా కృషి చేయడంతోనే పార్టీ 50వేల ఓట్లతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఎన్నికల అనంతరం క్రమంగా నేతల మధ్య దూరం పెరగడం ఆ పార్టీని కలవరపెడుతోంది. పార్టీ కార్యకలాపాలు కొంతమంది సీనియర్ నాయకులు జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తుండగా మరికొంత మంది మరో చోట నిర్వహిస్తుండడం చర్చకు తావిస్తోంది. రోజు రోజుకు నేతల మధ్య పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఆ పార్టీకి ఇబ్బందులు తలెత్తవచ్చని అంటున్నారు. ముథోల్ నియోజకవర్గంలో అక్కడి ఎమ్మెల్యే రామారావురావు పటేల్ వైఖరిపై చాలా మంది సీనియర్ నాయకులు గుర్రుతో ఉన్నారంటున్నారు. అక్కడి ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడల కారణంగా పార్టీ కేడర్ అయోమయానికి గురి అవుతుందని చెబుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలోనూ ఇదే పరిస్థితి..

కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య బేధాభిప్రాయాలు రోజు రోజుకు పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. నిర్మల్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డిలతో పాటు తదితరుల మధ్య సయోధ్య కుదరకపోతుండడంతో పార్టీ కార్యకలాపాలు సైతం వేరు వేరుగా నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే నేతల వ్యవహర శైలితో ఇక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అయోమయానికి గురి అవుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పటికి నేతల మధ్య బేధాభిప్రాయాలతో కేడర్ తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఈ అభిప్రాయ బేధాల కారణంగా రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా ఎదుర్కొంటుందనేదే చర్చగా మారుతోంది. ముథోల్ నియోజకవర్గంలో కూడా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల మధ్య బేధాభిప్రాయాలు రోజు రోజుకు ముదురుతున్నాయి. ఇప్పటికే ఈ నేతలిద్దరు వేరు వేరుగా కార్యకపాలను సాగిస్తుండడంతో కేడర్ అయోమయానికి లోనవుతోంది.

చుక్కాని లేని నావలా బీఆర్ఎస్...

జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కేవలం ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ నేతలు కొంత మేరకు తెరపైకి కనిపిస్తున్నప్పటికి నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ దయనీయ పరిస్తితిని ఎదుర్కొంటోంది. ఇప్పటికే కేడర్ అంతా చేజారిపోయినప్పటికి ఉన్న కొంతమంది నేతల మధ్య కూడా సయోధ్య లేకపోతుండడం ఆ పార్టీ శాపంగా మారుతోంది. మొన్నటి వరకు అధికారంలో కొనసాగి ఓ వెలుగు వెలిగిన బీఆర్ఎస్ పార్టీ కేవలం ఏడాదిన్నర కాలంలోనే తన ఆస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేసుకోవడం అంతటా ఆసక్తిని రేకేత్తిస్తోంది.

బాసరలో రిషికన్య వేద విశ్వవిద్యాలయ
ఏర్పాటుకు బాధ్యతాయుత భాగస్వామ్యం

- పతంజలి యోగ పీఠం ఉమ్మడి రాష్ట్ర మహిళ ప్రభారి మంజూష



వేద విద్యానంద స్వామితో మాట్లాడుతున్న పతంజలి యోగ పీఠం ఉమ్మడి రాష్ట్ర మహిళ ప్రభారి మంజూష

భైంసా, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : చదువుల తల్లి కొలువైన బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో రిషికన్య వేద విశ్వవిద్యాలయం నెలకొల్పడంతో పాటు నిర్వహణ ప్రక్రియకు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందిస్తామని పతంజలి యోగ పీఠం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మహిళ ప్రభారి మంజూష వెల్లడించారు. బుధవారం భైంసాలో రిషికన్య వేద విశ్వ విద్యాలయం ఏర్పాటుపై శ్రీ వేద భారతి పీఠం వేద విద్యానందస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా విద్యాలయ నిర్వాహణ వ్యవస్థను ఏర్పాటు చేద్దామని తెలిపారు. ఇక్కడ నెలకొల్పే రిషికన్య వేద విశ్వవిద్యాలయాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని పేర్కొన్నారు. విశ్వ విద్యాలయంలో అభ్యసించే మహిళలందరికి ఆహ్లదకరమైన వాతవరణంతో పాటు అన్ని రకాల వసతుల, సౌకర్యాలు కల్పించనున్నమని వివరించారు.బాసరలో ఇప్పటికే మహర్షి సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్టాన్ అనుమతితో వేద పాఠశాల నిర్వాహణ జరుగుతోందని వివరించారు. వేద పాఠశాల, రిషికన్య వేద విశ్వ విద్యాలయ నిర్వాహణకు భైంసా డివిజన్ ప్రాంత ప్రముఖులందరూ అంకితభావంతో సహకరిస్తూ తమ వంతు భాగస్వామ్యాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో బాసర వేద పాఠశాల కమిటీ అధ్యక్షులు శ్యామ్ మాందాని, కార్యదర్శి డా.ముష్కం రామకృష్ణగౌడ్, కార్యవర్గ ప్రతినిధులు పురస్తు గోపాల్, పతాంజలి యోగ పీఠం జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభ మాందానితో పాటు పలువురు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

- జిల్లా పశు వైద్యాధికారి బాలీగ్ అమెద్



మామడలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

మామడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పశువుకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వ్యాధి నిరోధక టీకాలను తప్పకుండా వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి బాలీగ్ అమెద్ అన్నారు. బుధవారం రోజున మండల కేంద్రంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పశువులపై శ్రద్ధ చూపించాలని, పౌష్టిక దాన పెట్టినట్లయితే మంచి పాల ఉత్పత్తి అవుతుందని, అధికపాలు ఇస్తుందన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించినట్లయితే వెంటనే పశు వైద్యాధికారిని సంప్రదించాలని లేనియెడల ఒకదాని నుండి ఒకదానికి వ్యాధి వ్యాపిస్తుందన్నారు. వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో మండల పశు వైద్యాధికారి మహేష్, సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.


ఘనంగా వీరేశలింగం పంతులు జయంతి



వీరేశలింగం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్గాపూర్ ప్లేయర్ ఉన్నత పాఠశాలలో బుధవారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమాజంలో కుల, వర్ణ, జాతి బేధాలు లేకుండా అందరూ సమానంగా, స్వేచ్ఛగా జీవించేందుకు చదువు ద్వారానే సాధ్యమని చెప్పి మహానుబావుడు వీరేశలింగం పంతులని పాఠశాల ప్రిన్సిపాల్ అన్నారు. సమాజం బాగు కోసం అనేక నవలలు, ఇతర రచనలు చేశారన్నారు. వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తను ఊడ్చి నిరసన తెలిపిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు



చెత్తను ఊడ్చి నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బాసర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన కొనసాగుతోంది.ఎనిమిదో రోజు ప్రధానద్వారం వద్ద చెత్తను ఊడ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు.గత కొన్ని సంవత్సరాలుగా అన్ని అర్హతలతో గ్రామీణ విద్యార్థులకు సేవలందిస్తున్న తమకు ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసనలు కొనసాగుతాయని లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉపేందర్, కృష్ణప్రసాద్,రాకేష్ రోషన్, రాకేష్‌రెడ్డి, శంకర్ , చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జొన్నల కొనుగోలు కేంద్రాల ప్రారంభం

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలో ప్రాధాన్యతననుసారం శుక్రవారం నుంచి ఆయా ప్రాంతాలలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలిపారు. సంబంధిత విషయంలో బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్‌ను కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయని వివరించారు. నియోజక వర్గ పరిధిలో ప్రస్తుతం జొన్న సాగు విస్తీర్ణం పెరగడంతో కాకుడా అనుకూల వాతవరణం నెలకొన్న నేపథ్యంలో దిగుబడులు సైతం గణనీయంగా వచ్చాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎకరానికి కొనుగోలు పరిమితి 14 క్వింటాళ్లకు పెంచాలని మంత్రి తుమ్మలకు చేసినట్లుగా వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రి తక్షణమే కొనుగోల కేంద్రాలను ప్రారంభించాలని, ఎకరాకు 14 క్వింటాళ్ల పరిమితితో కొనుగోళ్లు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసారని తెలిపారు. నియోజక వర్గ రైతాంగం జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల మార్క్‌అవుట్ వేగవంతం చేయండి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మార్క్‌అవుట్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ ప్రక్రియ, వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారం, తదితర అంశాలపై ఆమె సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన ఇందిరమ్మ ఇళ్ల మార్క్‌అవుట్ వివరాలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆమె మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తొలి దశలో ఎంపికైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మార్కౌట్ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల మార్కౌట్ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అర్హతలు, జీవోకి సంబంధించిన వివరాలపై ఇందిరమ్మ ఇళ్ల కమిటీల సభ్యులకు అవగాహన కల్పించేందుకు మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్యలు ఉన్నట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని, బోరు బావులు, చేతి పంపులు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అవసరమైన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలన్నారు. భూగర్భ జలాల లభ్యత తక్కువగా ఉన్న మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ పనులను ఉదయం 7 గంటల నుంచి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

11 గంటల వరకే నిర్వహించాలని, పనుల ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ పొట్లాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని 117 ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధి హామీ నిధుల ద్వారా 228 మరుగుదొడ్లను మంజూరు చేశామని, వాటి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మండల కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల అవసరమైతే తగిన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పాదర్శకంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓపెన్ పదవ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 20 నుండి 26వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపెన్ పదవ తరగతి పరీక్షలు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షల కోసం జిల్లాలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఓపెన్ పదవ తరగతికి 697 మంది, ఓపెన్ ఇంటర్‌కు 511 మంది విద్యార్థులు హాజరవ్వనున్నారని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఓపెన్ పదవ తరగతి పరీక్షలకు ఐదు నిమిషాల ఆలస్యానికి అనుమతించాలన్నారు. అయితే సిబ్బంది, విద్యార్థులకు మొబైల్‌ఫోన్లు అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ దుకాణాలను తాత్కాలికంగా మూసి వేయాలని సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా సమయంలో భద్రత ఏర్పాట్లు ఖచ్చితంగా ఉండాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరా నిరవధికంగా ఉండేలా చూడాలని, పరీక్షల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేకబస్సులను నడపాలని సూచించారు. పరీక్షాకేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. బెంజీలు, బల్లలు సరైన స్థితిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, డీఈవో పి. రామారావు, ఏసీజీఈ పరమేశ్వర్, డీఎంహెచ్‌వో రాజేందర్, సీడీపీవో నాగమణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు
అవగాహన పెంచుకునేందుకే ఆస్ట్రానామికల్ ల్యాబ్

సోన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పాఠ్యపుస్తకాల్లో వచ్చే పాఠాల్లోని ప్రయోగాలను చేసి చూడడానికి, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను ప్రత్యక్ష పరిశీలన, అవగాహన పెంచుకోవడానికి ఈ ఆస్ట్రానామికల్ ల్యాబ్స్ ఎంతో ఉపయోగ పడతాయని ఢిల్లీ నుంచి విచ్చేసిన పరిశీలకులు దయానిధి, రిసోర్స్ పర్సన్స్ ఆర్ఎస్ మిశ్రా, నిషిత్‌లు అన్నారు. ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, బయోసైన్స్ టీచర్లకు ఆస్ట్రానామికల్ ల్యాబ్ (ఖగోళ అంతరిక్ష ప్రయోగశాల)పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సోన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఈ కార్యక్రమంలో పరిశీలకులు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థి స్థాయి నుంచే అంతరిక్ష ఖగోళ వస్తువుల గురించి అవగాహన, టెలిస్కోప్ పని చేసే విధానం, వాటి పనితనాన్ని, వాటి పట్ల అవగాహనను వివిధ పాఠశాలల నుంచి వచ్చి ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, బయోసైన్స్ టీచర్లకు అవగాహన పెంచామన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 4 ఉన్నత పాఠశాలలకు సంబంధించి కలెక్టర్, డీఈవోలు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని నిర్వాహకులు తెలిపారు. సోన్, పొన్కల్, భోసి, కేజీబీవీ నిర్మల్ రూరల్ (అనంతపేట్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాలలో రూ.5 లక్షలతో ఈ ఆస్ట్రోనామికల్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరాధన, డీఎస్‌వో వినోద్‌కుమార్, వందన, పూర్ణచందర్, భీమేష్, రాజగోపాల్, సుధాకర్, సాయిరాం, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోన్ గ్రామాన్ని సందర్శించిన
రాష్ట్ర గల్ఫ్ కార్మిక సంక్షేమ సలహా మండలి చైర్మన్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

సోన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్‌లో హత్యకు గురైన అష్ట ప్రేమ్ సాగర్ కుటుంబాన్ని బుధవారం రాష్ట్ర గల్ఫ్ కార్మికుల సంక్షేమ సలహా మండలి చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బి.ఎం. వినోద్ కుమార్ పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. ఇప్పటికే దుబాయ్ రాయబారి కార్యాలయానికి ఫోన్ ద్వారా మాట్లాడి మృత దేహాన్ని త్వరగా తెప్పించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్‌రావు, సింగిరెడ్డి సరేష్‌రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, సోన్ గ్రామ మాజీ సర్పంచ్ వినోద్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

20 నుంచి సార్వత్రిక పరీక్షలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20 నుండి 10 ఇంటర్మీడియట్ సార్వత్రిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగ కమిషనర్ మూడారపు పరమేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లను ఆయా అధ్యయన కేంద్రాలకు అందజేశామన్నారు. ఉదయం 9 నుండి 12 వరకు మధ్యాహ్నం 2:30 నుండి 5:30 గంటలకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఏదైనా గుర్తింపు కార్డుతో అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని, 5 నిమిషాలు మించితే అనుమతి ఉండదని పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షలహాల్ టికెట్లు డీఈవో కార్యాలయంలో సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

సంగ్రహణాత్మక పరీక్షల పరిశీలన

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం వెంకటాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సంగ్రహణాత్మక పరీక్షలను బుధవారం డీఈవో రామారావు పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేసి తరగతి గదిలో ప్రగతి ప్రదర్శించాలన్నారు. మరమ్మతుల కోసం ప్రణాళిక విభాగంలో సంప్రదించాలని సూచించారు. సమన్వయకర్త ప్రవీణ్ కుమార్, హెచ్ఎం సుహాసిని, తదితరులు ఉన్నారు.

నేడు ఖానాపూర్‌లో బీఎస్ఎన్ఎల్
వినియోగదారుల సేవా శిబిరం

ఖానాపూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గురువారం బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా శిబిరం నిర్వహించనున్నట్లు డీఈ ఎస్. శర్మన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఈ సేవా శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని తమకున్న సమస్యలను, సలహాలను, సూచనలను తెలియజేయాలని ఆయన కోరారు.

నేడు మండల కమిటీ ఎన్నిక

తానూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల బీజేపీ కమిటీని గురువారం ఎన్నుకోనున్నట్లు మండల బీజేపీ అధ్యక్షులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల అబ్జర్వర్‌గా రాజేశ్‌బాబు హాజరవుతున్నారని, కావున మండలంలోని అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు, వివిధ పదాధికారులు, కార్యకర్తలు అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

పూజారి రమేష్ పంతులు మృతికి
ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సంతాపం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అష్టభుజ వేణుగోపాలస్వామి ఆలయ పూజారి రమేష్ పంతులు మృతికి నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

ప్రాథమిక విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే

సోన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ఈ విద్యా సంవత్సరం ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులు విద్యా వ్యవస్థలో అతి ప్రాముఖ్యత గల ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న సందర్భంగా వారు భవిష్యత్‌లో మంచి ఉన్నత విద్యా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో టి.పరమేశ్వర్ మెమెంటో ప్రదానం చేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఆర్. రమేష్‌బాబు, ఉపాధ్యాయులు మంగమ్మ, రాధా పాల్గొన్నారు.